ప్రజాశక్తి
బుధవారం 20 నవంబర్ 2024
5
శ్రీ సత్యసాయి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

వ్యక్తిగత, కమ్యూనిటీ మరుగుదొడ్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లో వాటర్, శానిటేషన్, జిల్లాస్థాయి తొలి సమావేశం కమిటీ ఛైర్మన్ కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. కమిటీ కన్వీనర్గా ఆర్డబ్ల్యుఎస్ ఎస్ఈ వ్యవహరించగా మరో 10 శాఖల అధికారులు సభ్యులు ఉన్నట్లు కలెక్టర్ ప్రకటించారు. కొళాయి కనెక్షన్లతో స్వచ్ఛమైన నీటిని ప్రతి ఇంటికీ అందించడమే లక్ష్యంగా పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా పారిశుధ్య కార్యక్రమాలు పక్కాగా జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత కమిటీదే అన్నారు. వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్ల నిర్మాణంలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సమాజంలో పర్యావరణం, ఆరోగ్యం పరిరక్షించడానికి పారిశుధ్య నిర్మూలనే ధ్యేయంగా పనిచేయాలన్నారు. మండలాల వారీగా అధికారులందరూ సమన్వయంతో మరుగుదొడ్ల నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీలు, సచివాలయ ఉద్యోగులు, మహిళా సమాఖ్య సభ్యులను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, డిఆర్డిఎ పీడీ నరసయ్య, జల వనరుల శాఖ విజయ్ కుమార్ రెడ్డి, డిపిఒ సమత, వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలిపై అవగాహన కల్పించాలి

ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కోటి కుటుంబాలకు సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు 300 యూనిట్లు ఉచిత విద్యుత్ అందించేందుకు ఈ పథకం ముఖ్య ఉద్దేశం అన్నారు. అందుకు సంబంధిత అధికారులు అందరూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి నివాళి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

భారతదేశ చరిత్రలో అత్యంత శక్తివంతమైన తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ కీర్తి గడించారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా సత్యం తెలిపారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఆమె దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. సత్యం మాట్లాడుతూ మహిళ అబల కాదు సబల అని ఇందిరాగాంధీ నిరూపించారన్నారు. పాలనలో విప్లవాత్మకమైన చర్యలు తీసుకొని బడుగు, బలహీన వర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఎన్నో ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఇందిరా గాంధీ పాలనలో దేశం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. మహిళా ప్రధానిగా దేశానికి ఆమె అందించిన సేవలు ఆమోఘం అన్నారు. ఆమె స్ఫూర్తితో ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ దేశంలో ముందుకు పయనిస్తోందని తెలియజేశారు. ఆమె శక్తియుక్తులను చూసి ప్రపంచ నేతలే ఆశ్చర్యం వ్యక్తం చేశారన్నారు. భారతరత్న అవార్డుతో పాటు ఉక్కు మహిళగా పేరు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టు రైతుల సమస్యలపై నిర్లక్ష్యం

ఎన్నికల హామీలు అమలు చేయండి - పట్టు రైతుసంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బారెడ్డి

ఎంపికైన నూతన కార్యవర్గంతో జిల్లా కార్యదర్శి బడా సుబ్బారెడ్డి పట్టు రైతుల సంఘం గౌరవాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన ప్రోత్సాహక నిధులను వెంటనే విడుదల చేయాలని పట్టు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బడా సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పట్టు గూళ్ల మార్కెట్లో ఉమ్మడి జిల్లా పట్టు రైతుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు పట్టు రైతులు, రీలర్లను పూర్తిగా విస్మరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టు రైతులు, రీలర్లకు ఇవ్వాల్సిన ప్రోత్సాహకాలను విడుదల చేసి ఆదుకోవాలన్నారు. 2019 ఎన్నికల సమయానికి రూ.4కోట్ల వరకు బకాయిలు ఉన్నాయన్నారు. అనంతరం 2019 ఎన్నికల ప్రచారంలో భాగంగా హిందూపురంలో జరిగిన ఎన్నికల సభలో జగన్ మోహన్ రెడ్డి పట్టు రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, ప్రోత్సాహకాలను రూ.50 నుంచి రూ.100 వరకు పెంచడంతో పాటు ఇతర హామీలు ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చాక వాటి అమలును పూర్తిగా విస్మరించారన్నారు. గతంలో 90 శాతం సబ్సిడీతో పట్టు రైతులకు ఇస్తున్న చంద్రింకలు, ఇతర పరికరాలు ఇవ్వలేదన్నారు. స్ప్రింక్లర్లతో పాటు రేషం షెడ్డు నిర్మాణానికి ఇస్తున్న రూ.4లక్షలు సైతం ఇవ్వలేదన్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రోత్సాహకాలు రూ. 60కోట్లు విడుదల కావాల్సి ఉందన్నారు. ఒక్క హిందూపురంలోనే దాదాపు రూ.6 కోట్ల వరకు బకాయి ఉందన్నారు. ఇప్పటికైన కూటమి ప్రభుత్వం బకాయి ఉన్న ప్రోత్సాహకాలను విడుదల చేసి పట్టు రైతులు, రీలర్లను ఆదుకోవాలన్నారు. షెడ్ల నిర్మాణానికి 90 శాతం సబ్సిడీతో నిధులు ఇవ్వాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

బడా సుబ్బారెడ్డి, గౌరవ అధ్యక్షులు ధనాపురం వెంకట్రామి రెడ్డి సమక్షంలో పట్టు రైతుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.సోము కుమార్, కార్యదర్శిగా ఒ.సిద్ధారెడ్డి, ఉపాధ్యక్షులుగా చంద్రశేఖర్ రెడ్డి, హనుమంత రెడ్డి, ఎం.బసవరాజు, రామకృష్ణారెడ్డి, సహాయ కార్యదర్శిగా రామకృష్ణారెడ్డి, ట్రెజరర్గా కెఆర్.నవీన్లతో పాటు జిల్లా కమిటీ సభ్యులుగా 25 మందిని ఎన్నుకున్నారు.

ధైర్య సాహసాలు మహిళ సొంతం

డాక్టర్ రాజేశ్వరి సి.పటేల్

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ పటేల్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సౌమ్యతతో పాటు ధైర్య సాహసాలు మహిళల సొంతమని సత్యసాయి అనంతపురం క్యాంపస్ మాజీ డైరెక్టర్ రాజేశ్వరి సి.పటేల్ పేర్కొన్నారు. మంగళవారం ప్రశాంతి నిలయంలో భగవాన్ సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకల్లో భాగంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పుట్టపర్తి, అనంతపురం, బందావన్ సత్యసాయి మహిళా విద్యార్థులు సాయికుల్వంత్ హాల్ వరకు ర్యాలీగా కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యసాయి గత 30 ఏళ్ల క్రితం నవంబర్ 19న మహిళా దినోత్సవం నిర్వహించారన్నారు. అప్పటినుంచి ఏటా నవంబర్ 19న సత్యసాయి జయంతి వేడుకల్లో మహిళా దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అన్ని రంగాల్లో మహిళలు రాణించాలని సత్యసాయి ఆకాంక్షించారన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన మహిళలు మన సంస్కృతి సాంప్రదాయాలు మరువకూడదన్నారు. మహిళలు తమ సామర్థ్యాన్ని గ్రహించడానికి స్వీయ అవగాహన అవసరమన్నారు. మహిళలు మరింత శక్తివంతమైన శక్తిగా ఎదగాలన్నారు. మహిళలు సమర్థవంతంగా తమ కుటుంబాలను నడుపుతూ అదే విధంగా తన దైనందిత కార్యక్రమాలలో క్రమశిక్షణగా మెలగడం మహిళలకే సొంతమన్నారు. నేటి సమాజానికి కూడా ఉపయోగపడే సత్యసాయి బోధనలు సత్యం, ధర్మం, ప్రేమ, శాంతి అర్థం చేసుకుని ప్రవర్తించాలన్నారు. అనంతరం సత్యసాయి మహాసమాధి సన్నిధిలో విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

హాజరైన మహిళలు

నిందితుల అరెస్టును చూపిస్తున్న సిఐలు

ఆరుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్

1.800 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-హిందూపురం

ఆరుగురు గంజాయి విక్రేతల ముఠాను అరెస్టు చేసి వారి నుంచి 1.800 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సిఐలు ఆంజనేయులు, జనార్ధన్ తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐలు వివరాలను వెల్లడించారు. ఎస్పీ వి.రత్న ఆదేశాల మేరకు హిందూపురం డీఎస్పీ వికె.మహేష్ నేతత్వంలో గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా లేపాక్షి మండలం, మల్లిరెడ్డిపల్లి గ్రామ శివారులో గల హెరిటేజ్ ఫుడ్స్ ముందు వైపున నిర్మానుష్య ప్రాంతంలో అక్రమంగా గంజాయి సరఫరా, విక్రయాలు సాగుతున్నట్లు అందిన సమాచారం మేరకు నిఘా ఉంచామన్నారు. పక్కా సమాచారంతో లేపాక్షి ఎస్ఐ నరేంద్రతో కలిసి మంగళవారం నాడు దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా గంజాయి విక్రయిస్తున్న సయ్యద్ బర్కత్ అలీ, వంశీ కృష్ణ, ఉదయ్ కిరణ్, సయ్యద్ అమీర్, పూరింటి తిమ్మప్ప, సైపుల్లాఖాన్లను అదుపులోకి తీసుకున్నారు. అరుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1.800 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐలు తెలిపారు. గంజాయి ముఠాను అరెస్టు చేయడంలో కృషి చేసిన డీఎస్పీ వికె.మహేష్, సిఐలు ఆంజనేయులు, జనార్ధన్, ఎస్ఐలు నరేంద్ర, శ్రీధర్, హెడ్కానిస్టేబుల్ లక్ష్మీపతి, గంగాధర్, వెంకటరాముడు, పోలీసులు చంద్రమోహన్, నరసింహమూర్తి, వెంకటేశ్వర్లు, రంగా, మహేష్లను ఎస్పీ వి.రత్న అభినందించారు.

సేమియా ప్యాకెట్పై రూ.47 ఉన్న ధర

రూ.52లకు విక్రయిస్తూ మోర్ నిర్వాహికులు ఇచ్చిన బిల్లు

ధరలు 'మోర్'..!

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయాలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని మోర్ సూపర్ మార్కెట్లో ఎమ్మార్పీ ధరలకు తిలోదకాలు పలికి అధిక ధరలకు విక్రయాలు చేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఓ వినియోగదారుడు మోర్ సూపర్ మార్కెట్లో సోమవారం సాయంత్రం ఆహార పదార్థాలను కొనుగోలు చేశారు. ఎంటిఆర్ వెర్మీసెల్ సేమియాపై ఎంఆర్పి ధర రూ.47 ఉంటే... బిల్లులో రూ.52 వేసి అధికంగా తీసుకున్నారు. ఇలా పలుమార్లు మోసపోయినా వినియోగ దారులు అక్కడ విధులు నిర్వహించే సిబ్బందిని హెచ్చరించారు. అయినప్పటికీ కంప్యూటర్లో అప్డేట్ కాలేదని చెబుతు వినియోగదారులను మోసం చేస్తున్నారు. బిల్లును పరిశీలన చేసి ప్రశ్నిస్తే సారీతో సరిపెడుతున్నారు. ఇలా వినియోగదారులను మోసం చేస్తున్న మోర్ సూపర్ మార్కెట్ పై అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

'ఉపాధి' పని దినాలు పెంచండి : పీడీ

గాండ్లపెంట : ఉపాధి హామీ పని దినాలను పెంచాలని పిడి విజయేంద్ర ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఏపీవో మంజునాథ్ ఆధ్వర్యంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించగా పిడి విజయేంద్రప్రసాద్, ఎపిడి రమేష్బాబు హాజరయ్యారు. వారు మాట్లాడు తూ ఉపాధి కూలీలకు పని దినాలు పూర్తిస్థాయిలో తగ్గిపోతున్నాయని, పని దినాలు పెంచే విధంగా కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండల వ్యాప్తంగా జాబ్కార్డు ఉన్న కూలీలకు వంద రోజులు పనులు కల్పించాలని, కూలీల శాతం పెంచి ఉద్యానవనం, చెరువుల్లో పూడికతీత పను లు కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి, ఈసీ సుబ్బారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు రాజశేఖర్, శ్రీనివాసులు, మహేష్, అక్బర్అలి, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారి తస్లీమకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

అపరిశుభ్ర ఆహార పదార్థాలు అమ్మితే చర్యలు

ప్రజాశక్తి-చిలమత్తూరు

అపరిశుభ్రంగా ఉన్న ఆహారపదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఫుండ్ అండ్ సేఫ్టీ జిల్లా అధికారి తస్లీమ హెచ్చరించారున. ఆమె మంగళవారం చిలమత్తూరులో బేకరీలు, కిరాణా షాపులు, హోటళ్లు, చికెన్, మటన్ షాపులను తనిఖీ చేశారు. పలు షాపుల యాజమానులకు నోటీసులు అందజే శారు. పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించారు. కలుషిత నూనెను పారబోయించారు. ఈ సందర్భంగా ఆమెకు సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రోడ్డుపై చికెన్, మటన్ విక్రయాలు నిర్వహిస్తున్నారని, వాటిపై దుమ్ము, దూళి పడి కలుషితం అవుతున్నాయని, చికెక్ కబాబ్, బేకరీ ఆహారపదార్థాల తయారీలో హానికరమైన రంగులు వాడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు ప్రవీణ్, వెంకటేష్, రామచంద్ర, తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ఆయాల వేతనం పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న కంటెంజెంట్ ఆయాలకు వేతనాలు పెంచా లని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్పర్సన్ కాచర్ల లక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు నాయకులు జెవి.రమణ, మండల కన్వీనర్ టి.అయూబ్ఖాన్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చౌడమ్మ, జయ మ్మ, మాట్లాడుతూ పట్టణంలోని మున్సిపల్ పాఠశాలల్లో కంటెంజెంట్ ఆయాలు 30 ఏళ్లుగా పని చేస్తున్నా కేవలం రూ. 4వేలు వేతనం ఇవ్వడంతో కుటుంబ పోషణ భారమైందన్నారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా వారికి రూ. 10వేల వేతనం ఇవ్వడంతో పాటు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ముంతాజ్, వసంతమ్మ, నాగలక్ష్మి, గంగరత్న, ప్రమీల, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమస్యను విన్నవిస్తున్న సిఐటియు నాయకులు

వేలం పాట నిర్వహించొద్దు

కమిషనర్ను కోరిన కూరగాయల వ్యాపారులు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మాణం చేసిన నూతన మార్కెట్ ఆవరణంలో ఉన్న పార్కింగ్ స్థలానికి బుధవారం నాడు నిర్వహిస్తున్న బహిరంగ వేలంను రద్దు చేయాలని కూరగాయాల వ్యాపారులు కమిషనర్ను కోరారు. మంగళవారం కూరగాయాల వ్యాపారులు ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్కు వినతిపత్రం అందించి సమస్యలను వివరించారు. మార్కెట్ నిర్మాణం జరిగినప్పటి నుంచి ద్విచక్ర వాహనాలను నిలపడానికి పురపాలక సంఘం వారు బహిరంగ వేలం వేస్తున్నారు. బహిరంగ వేలంలో అధిక పాటకు పాడిన వారు ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్థలంలో తోపుడు బండ్ల వారికి అద్దెకు ఇస్తున్నారు. దీంతో లక్షలాది రూపాయాలు గుడ్ విల్ చెల్లించి అద్దెకు తీసుకుని, వేలాది రూపాయాలు అద్దె చెల్లిస్తున్నాం. మార్కెట్ బయట పార్కింగ్ స్థలంలో తోపుడు బండ్ల వారు కూరగాయాలు విక్రయిస్తుండడంతో కొనుగోలుదారులు ఎవరూ మార్కెట్ లోపలికి రావడం లేదు. కోనుగోలు చేసిన కూరగాయాలు అమ్ముడుబోక పారేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో సమస్యను అప్పటి మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి వివరించడంతో మార్కెట్ బయట ఉన్న ప్రహరీని పగలగొట్టి, అందరూ మార్కెట్ లోపలికి వచ్చి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ విషయం కౌన్సిల్లో సైతం అమోదం జరిగింది. అయితే ఇప్పటి వరకు ప్రహరీని తొలగించలేదు. తాజాగా పార్కింగ్ స్థలంలో మరో సారి బహిరంగ వేలం వేస్తామని ప్రకటన చేశారు. ఇదే జరిగితే మార్కెట్ లోపల గదులను అద్దెకు తీసుకున్న కూరగాయల వ్యాపారులు అందరూ పూర్తిగ నష్ట పోతారు. ఈ విషయంపై మరో సారి ఆలోచన చేసి కూరగాయాల వ్యాపారులకు న్యాయం చేయాలంటూ వ్యాపారులు కమిషనర్కు వారి సమస్యను విన్నవించారు.

మార్కెట్ ముందు పార్కింగ్ స్థలంలో తోపుడు బండ్లు పెట్టుకుని చేస్తున్న వ్యాపారాలు

ముగిసిన సంతోష్ ట్రోఫీ ఫుట్బాల్ టోర్నీ

గ్రూప్-జి నుంచి తమిళనాడు క్వాలిఫై

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం ఆర్డీటీ క్రీడా మైదానంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న సంతోష్ ట్రోఫీ ఫుట్బాల్ టోర్నీ మంగళవారం నాడు ముగిసింది. టోర్నీ లీగ్ పోటీల్లో భాగంగా మంగళవరం నాడు ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్లో తమిళనాడు జట్టు 8-0 తేడాతో ఆంధ్రప్రదేశ్పై విజయం సాధించింది. సాయంత్రం కర్నాటక, అండమాన్ జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. ఇందులో 11-0 గోల్స్ తేడాతో కర్నాటక జట్టు విజయం సాధించింది. సంతోష్ ట్రోఫీ గ్రూప్-జి ఆంధ్రప్రదేశ్లో జరిగిన నేషనల్ టోర్నీలో తమిళనాడు జట్టు క్వాలిఫై అయ్యింది. ఈ జట్టు ఫైనల్ లెవల్కు చేరుకుంది. ఫైనల్ లెవల్ తెలంగాణలోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది. మ్యాచ్ను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ఫుట్బాల్ అభిమానులు ఆర్డీటీ స్టేడియంకు విచ్చేశారు. అనంతపురంలో సంతోష్ ట్రోఫీ విజయవంతం చేయడం కోసం సహాయ సహకారాలు అందించిన కలెక్టర్, జయింట్ కలెక్టర్, ఆర్డీటీ యాజమాన్యానికి ఫుట్బాల్ ప్రధాన కార్యదర్శి డ్యానియల్ ప్రదీప్ ధన్యవాదాలు తెలిపారు.

అంగన్వాడీ వర్కర్పై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

మండలంలోని అమ్మవారిపల్లిలో అంగన్వాడీ వర్కర్ పార్వతమ్మపై దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కియో పోలీస్ స్టేషన్లో ఎఎస్ఐ నజీర్ అహ్మద్కు ఫిర్యాదు చేశారు. అంతకుముందు సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ లీడర్లు మీనాకుమారి, సుజాతమ్మ అమ్మవారి పల్లిలో పార్వతమ్మ ఇంటికి వెళ్లి దుండగులు ధ్వంసం చేసిన వస్తువులను పరిశీలించారు. రమేష్ మాట్లాడుతూ సోమవారం రాత్రి పార్వతమ్మ ఇంట్లో ఉండగా అదే గ్రామానికి చెందిన రాజశేఖర్ మద్యం మత్తులో గొడవ పెట్టుకుని దాడి చేయడంతో పాటు సెల్ఫోన్, ఫ్రిజ్, టీవీ, ఇతర వస్తువులు ధ్వంసం చేశాడని తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ రాజేష్కి ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వడంతో పాటు పార్వతమ్మకు రాజశేఖర్ నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నాయకులు, అంగన్వాడీలు

ప్రజాశక్తి
www.prajasakti.com

శివాలయం పునర్ నిర్మాణానికి నిధులు ఇవ్వండి

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

మండలంలోని నాగసముద్రం గ్రామంలో వెలసిన పురాతన శివాలయం పునర్నిర్మాణానికి నిధులు ఇవ్వాలని కోరుతూ ఎమ్మెల్యే పరిటాల సునీత, గ్రామస్తులు అమరావతిలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో 50 సెంట్ల స్థలంలో ఉన్న పురాతన శివాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, పునర్నిర్మాణానికి కొందరు దాతలు ముందుకొచ్చార తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిధులు వచ్చేలా చూడాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. స్పందించిన మంత్రి వెంటనే దేవాదాయ శాఖ ఇంజినీర్ల ద్వారా అంచనాలు వేయించి నిధులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సత్యసాయి జయంతి సందర్భంగా వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

శ్రీసత్యసాయిబాబా జయంతి సందర్భంగా పుట్టపర్తిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాలను మంగళవారం డిఎంహెచ్ఒ డాక్టర్ మంజువాణి సందర్శించారు. ఆయా శిబిరాల్లో ప్రజలకు అందు తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తూ, పౌష్టికాహారం తీసుకుంటూ ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారులు జ్యోత్స్న, దీప్తి, నారాయణరెడ్డి, కళ్యాణశృతి, సామజిక ఆరోగ్య అధికారి నగేష్, ఆరోగ్య కార్యకర్త అజీజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

హరీష్ పాఠశాలలో కార్తీక వనభోజనాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో మంగళవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు ఏర్పాటు చేశారు. మహిళలు ఉసిరి చెట్టు చుట్టూ దీపాలు వెలిగించి పూజలు చేశారు. సరస్వతీ దేవి ఆలయంలో పూజారి ప్రసాద్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. హరీష్ స్కూల్ అడ్వైజర్ ఎంఎస్.ప్రశాంత్, ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మేడా వరప్రసాద్, కార్యదర్శులు మాదాలం ఆనంద్‌బాబు, కోశాధికారి వంకధార జనార్దన్‌గుప్తా, తదితరులు కార్తీకమాసం విశిష్టతను వివరించారు. మహిళలు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలికి డాక్టరేట్

బి.శోభారాణి

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్‌నాయక్, బి.శోభారాణి దంపతులు ఇద్దరూ ఉపాధ్యాయులు. బి.శోభారాణికి తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం వృక్షశాస్త్రంలో డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆమె మంగళవారం తెలిపారు. వివరాలు.. ప్రొఫెసర్ సుజాతమ్మ, ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల అనంతపురం ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్‌రాజు పర్యవేక్షణలో బి.శోభారాణి 'బ్యాక్టీరియా ఎవెల్యుయేషన్ ఆఫ్ గ్రీన్ వాటర్ ఆల్గే ఇన్ కర్నూల్ డిస్ట్రిక్ట్' అంశంపై పరిశోధన చేసి ప్రచురించిన పరిశోధక గ్రంథానికి పిహెచ్‌డి లభించిందన్నారు. ఆమె రాసిన ఐదు పరిశోధక వ్యాసాలు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. బి.శోభారాణి లేపాక్షి మండలం పులమతి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. ఆమెకు డాక్టరేట్ రావడంపై గ్రామస్తులు, బంధువులు, సన్నిహితులు అభినందించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

ధరణి

మండలంలోని జగరాజుపల్లిలో ఉన్న మంగళకర డిగ్రీ కళాశాల విద్యార్థిని ధరణి సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు మంగళకర ఎడ్యుకేషన్ ట్రస్ట్ సురేష్‌కుమార్ తెలిపారు. బి.కాం థర్డ్ ఇయర్ చదువుతోన్న ధరణి ఎస్కే యూనివర్సిటీ తరఫున సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ కబడ్డీ జట్టుకు ఎంపికైంది. ధరణి ఈ నెల 29 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకూ తమిళనాడులోని అలగప్ప యూనివర్శిటీలో జరిగే సౌత్ జోన్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటుంది. ఆమెను ట్రస్టీ సురేష్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ ఆర్యప్రకాష్, ఏవో జయచంద్రారెడ్డి, ప్రిన్సిపల్ రమేష్‌బాబు, పిడి శ్రీనివాసులు, అధ్యాపక బృందం అభినందించారు.

సహజ సంపదను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-కొత్తచెరువు రూరల్

సహజ సంపదను రక్షించుకోవడం అందరి బాధ్యత అని పర్యావరణ వేత్త భాస్కర్‌నాయుడు, సినీ నటుడు కమల్‌కొండ సురేష్ సూచించారు. మండలంలోని తలమర్ల గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మంగ ళవారం హెచ్‌ఎం కె.లోకనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. వారు మాట్లాడుతూ సమస్త జీవరాశులకు జీవనాధారమైన ప్రకృతిని కాపాడుకోవటమే పరమావధిగా జీవించాలన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. విద్యార్థులు మానవత్వం, సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస, సేవా మార్గంలో ముందుకుపోవాలని తెలిపారు. కార్యక్రమంలో కమలకొండ సంతోష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఖాద్రీశుని హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గత 67 రోజులుగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ ఈవో వెండిదండి శ్రీనివాసరెడ్డి సమక్షంలో లెక్కించారు. అందులో రూ. 87,14,129 నగదు, బంగారు 57 గ్రాములు, వెండి 352 గ్రాములు, విదేశీ కరెన్సీ అమెరికా యుఎస్ఎ డాలర్స్ 606, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ 300 దినార్స్, కెనడా రూబీస్ 20, కువైట్ దినార్స్, నేపాల్ రూ. 50 ఉన్నట్లు అధికారులు తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షణ అధికారిగా రవీంద్రరాజు వ్యవహరించారు. లెక్కింపు కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది, కెనరా బ్యాంకు మేనేజర్ అనంతబాబు, సిబ్బంది, వివిధ సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ఈ నెల 24వ తేదీ అనంతపురంలో జరిగే రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కరపత్రాలను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు కలవల రాంకుమార్ నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావే శంలో సంఘం జిల్లా నాయకులు పెనుజూరు నాగరాజు, ఎపి ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు ధూపకుంట్ల శబరి వరప్రసాద్ మాట్లాడుతూ బొమ్మనహాల్ మండలంలోని చంద్రగిరి గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన కృష్ణమూర్తిని హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కలవల నాగతేజ, శ్రీనివాసులు, అంబటి అవినాష్, మురళి, వంశీరామ్, ఆర్యవైశ్య ప్రముఖులు, సభ్యులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన మస్తాన్‌వలి, నస్రిన్ దంపతుల కుమారుడు సమీర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పాఠశాల తరఫున హాకీ ఆడడానికి వెళ్లగా తలకు బలమైన గాయమై రక్తం గడ్డ కట్టి తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. అతడికి అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని వైద్యులు తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితని తెలుసుకున్న ఎంఎం డిఎ జిల్లా అధ్యక్షులు రోషన్ జమీర్ మంగళవారం రూ. 10వేలు అందజే శారు. భవిష్యత్తులో కూడా వైద్య సహాయానికి ఎంఎండిఎ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. రోషన్ జమీర్‌ను ఎంఎండిఎ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎండి ఇమామ్ అభినందించారు. కార్యక్రమంలో నియోజక వర్గ అధ్యక్షులు సయ్యద్ దాదాపీర్, నబిజిక్రియ, ఖాదర్‌వలి, పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎంఎండిఎ సభ్యులు

సాగునీటి ప్రాజెక్టు పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు పనులను త్వరగా చేపట్టాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి మంగళ వారం అసెంబ్లీలో కోరారు. నియోజకవర్గం లోని 195 చెరువులకు నీరందించేందుకు 'రాయలసీమ కరువు నివారణ ఎత్తిపోతల పథకం' ద్వారా పనులు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. రాయలసీమ కరువు నివారణ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు పూర్తయితే నియోజవర్గంలో సుమారు 10 వేల ఎకరాలు సాగులోకి వచ్చి 2.34 లక్షల మందికి తాగునీరు అందించవచ్చన్నారు. ఈ ప్రాజెక్టు పనులను ఎప్పుడు ప్రారంభిస్తారు.. ఎప్పటికీ పూర్తిచేస్తారో నిర్దిష్ట గడువు తెలపాలని ఎమ్మెల్యే నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కోరారు.

వడ్డెర్లను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

రాష్ట్ర వ్యాప్తంగా వడ్డెర్లను సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 2014లో సిఎం చంద్రబాబు వడ్డెర్లను ఎస్‌టి జాబితాలోకి చేర్చాలని అప్పట్లో సత్యపాల్ కమిటీని వేసిన విషయాన్ని, అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు మరోమారు అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్ సమావేశాల్లో ఆమోదం పొందేలా ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డెర హక్కుల కోసం పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వమే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. క్వారీలో పని చేసే వడ్డెర్లకు 25 శాతం క్వారీలను కేటాయించాలని, వడ్డెర కార్పొరేషన్‌కు అధికంగా నిధులు కేటాయించాలని కోరారు.

అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

అసెంబ్లీలో సమస్యలు ప్రస్తావిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రామసభలు : ఆర్డీవో

ప్రజాశక్తి-మడకశిర

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని పెనుకొండ ఆర్డీవో ఆనందకుమార్ తెలిపారు. రొళ్ల మండలంలోని రత్నగిరిలో మంగళ వారం నిర్వహించిన గ్రామసభలో ఆర్డీవో మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల ను అధికారుల దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. సదస్సులో తహశీల్దార్ షెక్షావలి, ఎంపీడీవో రామారావు, ఎంఇఒ శ్రీధర్, రత్నగిరి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ జి.దివ్యజ్యోతి, రెవెన్యూ సిబ్బంది, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రొళ్ల మండలం రత్నగిరిలో అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో ఆనంద్‌కుమార్

ధర్మవరం రూరల్ : మండలంలోని రావులచెరువు గ్రామంలో రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో ఇన్‌ఛార్జి తహశీల్దార్ సురేష్ ప్రజల నుంచి వివిధ సమస్యలపై వినతులు స్వీకరించారు. గ్రామసభలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌వో నారాయణస్వామి, టిడిపి నాయకులు చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ : ప్రజల సమస్యలను పరిష్కరించడానికే గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్‌చక్రవర్తి తెలిపారు. మండలంలోని కొంకల్లు గ్రామంలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించి రైతులు, ప్రజల నుంచి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మహమ్మద్ బిలాల్, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గుండె జబ్బులపై జాగ్రత్త పడాలి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ప్రస్తుత సమాజంలో గుండె జబ్బులు ఎక్కువయ్యాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచించారు. తన అవ్వ భీమినేని నారమ్మ జ్ఞాపకార్థం పట్టణంలోని 25వ వార్డ్ ఇన్‌ఛార్జి భీమినేని ప్రసాద్‌నాయుడు మంగళవారం స్థానిక ఎర్రగుంట సర్కిల్ వద్ద ఉన్న శిశు సంక్షేమ కార్యాలయంలో కిమ్స్ సవేరా ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు గుండె పరీక్షలు చేయడంతో పాటు మందులు పంపిణీ చేశారు. పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖులు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం చాలా అవసరం అన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్, పట్టణ టిడిపి అధ్యక్షులు పరిసే సుధాకర్, చింతలపల్లి మహేష్‌చౌదరి, రాళ్లపల్లి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయండి

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలో టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులకు సూచించారు. గుడిబండలో మంగళవారం పార్టీ సీనియర్ నాయకులు, న్యాయవాది శివకుమార్ ఇంటి ఆవరణలో సభ్యత్వ నమోదు, అభివృద్ధి పనుల పర్యవేక్షణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో మడకశిర నియోజకవర్గంలో గుడిబండను మొదటి స్థానంలో నిలవాలన్నారు. అలాగే ప్రభుత్వం మంజూరు చేసిన సీసీ రోడ్లను డిసెంబర్ లోపు పూర్తి చేసి బిల్లులు పొందాలన్నారు. త్వరలో జరిగే సాగునీటి సంఘాల ఎన్నికల్లో టిడిపి సానుభూతిపరులను ఎన్నుకోవా లని సూచించారు. సమావేశంలో మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, జిల్లా వీరశైవ లింగాయత్ అధ్యక్షులు దుర్గేష్, న్యాయవాది షబ్బీర్, శివకుమార్, కార్యదర్శి ప్రకాష్, నాయకులు లక్ష్మీనరసప్ప, భీమరాజు, ఎంపిటిసి వనజ శశిధర్, పురుషోత్తం, రాజన్న, నజీర్, భోజరాజు, వెంకటేష్, జయరామప్ప, బాదిపల్లెప్ప, కృష్ణమూర్తి, చిత్రశేఖర్, నాగరాజు, లక్ష్మీనారాయణప్ప, రవిస్వామి, చంద్రప్ప, డీలర్ దాసన్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి

దేశానికి ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ దేశ ప్రజలకు చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోయాయని బాలికల ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం విజయభాస్కర్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన మంగళవారం పాఠశాలలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ మహిళా ప్రధాని అయిన ధైర్యంగా ఎన్నో సంస్కరణలు చేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. మహిళలు ఇందిరాగాంధీని ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులు పోటీ తత్వంతో చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటరమణ, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రొద్దంలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళుర్పిస్తున్న విద్యార్థులు

రొద్దం : మహిళా దినోత్సవం, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అరుణ, రాజేశ్వరి మాట్లాడుతూ ఇందిరాగాంధీ దేశం కోసం చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు, మహిళలు, పాఠకులు పాల్గొన్నారు.

ఆయకట్టు కాలువను పరిశీలిస్తున్న డిఈ లక్ష్మీనారాయణ

ఆయకట్టు కాలువ సమస్య పరిష్కారం

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని శిరీకోళం, నరసాపురం గ్రామాల ఆయకట్టు భూమికి పరిగి చెరువు నుంచి సరఫరా అయ్యే నీటి తరలింపునకు వినియోగి స్తున్న కాలువలు పూడిపోవడంతో రెండు గ్రామాల మధ్య వివాదంగా మారింది. దీంతో రెండు గ్రామాల ఆయకట్టు రైతులు అధికారులను సంప్రదించారు. స్పం దించిన ఇరిగేషన్ అధికారి డిఈ లక్ష్మీనారాయణ మంగళవారం ఆ గ్రామ వెళ్లి కాలువలను పరిశీలచి తక్షణం మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డీఈ వెంట టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మాజీ జెడ్పిటిసి సూర్యానారాయణ, రైతులు ఉన్నారు.

విద్యార్థుల ఆధార్ అప్‌డేట్‌పై ఎంపిడిఒ ఆరా

ప్రజాశక్తి-తలుపుల

మండలంలోని బత్రేపల్లి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవా రం ఎంపిడిఒ రమానాయక్ సందర్శించారు. అనంతరం కెజిబివిలో జిఎస్‌డ బ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఆధార్ సెంట ర్‌ని సందర్శిం చారు. అపార్ నమోదులో స్టూడెంట్స్ ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా సత్వరమే ఆధార్ అప్‌డేట్ చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే పూలవాండ్లపల్లిలో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించారు. వేపమానిపేట, పెద్దన్నవారిపల్లి గ్రామ సచివాలయాలను సందర్శించి హౌస్ టు హౌస్ జియో ట్యాగ్ సర్వేను గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారున. మైరాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సెక్రటరీని ఆదేశించారు.

జాబ్‌మేళాలో 23 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-బుక్కపట్నం

జాబ్‌మేళా ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మక్బూల్‌హుస్సేన్ తెలిపారు. కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఇందులో 3 కంపెనీల ప్రతినిధులు పాల్గొనగా 54 మంది యువతీ యువకులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారిలో 23 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక ఎంపికయ్యారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

అమడగూరు, తనకల్లులోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నల్లమాడ సిఐ నరేందర్‌రెడ్డి, అమడగూరు ఎస్ఐ వెంకటనారా యణ, తనకల్లు ఎస్ఐ గోపి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలు, మహిళలపై జరిగే నేరాలు, సైబర్ క్రైమ్, గంజాయి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. రోడ్ సేఫ్టీ, డయల్ 100, పోక్సో, దిశా చట్టాలు, రోడ్డు ప్రమాదా లు, నివారణ చర్యలు, సెల్‌ఫోన్ వాడటం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

పాఠశాల పనివేళల పెంపును విరమించుకోవాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పాఠశాల పనివేళల పెంపు నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకో వాలని వైఎస్ఆర్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పివి.రమణారెడ్డి, కార్యదర్శి ఇంద్రప్రసాద్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల డిమాండ్లను పక్కకు పెట్టి అడగని వాటిని ప్రభుత్వం ముందు కు తేవడం శోచనీయమన్నారు. ఇప్పటికే ఉపాధ్యాయులకు అనేక బోధనేతర పనులు అప్పగిస్తున్న ప్రభుత్వం ఇప్పుడు ఈ నిర్ణయం తీసుకోవడం సరైంది కాదన్నారు. ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. వెంటనే పిఆర్‌సి, అరియర్స్, డిఎ బకాయిలు చెల్లించాలని, 25 ఏళ్ల సర్వీసు పూర్తయిన ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కర్నాటక పెట్రోల్ రవాణాపై ఫిర్యాదు

ప్రజాశక్తి-గుడిబండ

సరిహద్దు గ్రామాల్లోని దుకాణదారులు కర్నాటకలోని పెట్రోల్ బంకుల నుంచి పెట్రోల్ తీసు కొచ్చి విక్రయించడంపై మంగళవారం మండలంలోని కెఎన్.పల్లి గ్రామంలో ఉన్న శ్రీఏడుకొండలు కిసాన్ సేవా కేంద్రం పెట్రోల్ బంక్ యజమాని తిప్పేస్వామి రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యా దు చేశాడు. తిప్పేస్వామి మాట్లాడుతూ దుకాణదారులు కర్నాటక నుంచి క్యాన్లలో పెట్రోల్ తెచ్చి విక్రయిస్తున్నారని, దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని వాపోయాడు. పెట్రోల్ అక్రమ రవాణాను అడ్డుకోవాలని డిప్యూటీ తహశీల్దార్ కళ్యాణ్ చక్రవర్తికి, ఎఎస్ఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేశాడు. స్పందించిన అధికారులు కర్నాటక నుంచి పెట్రోల్, డీజిల్ తీసుకురాకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని చిన్నకోడిపల్లి గ్రామంలో మంగళవారం అనంతశక్తి సిఇఒ లావణ్య అధ్యక్షతన సుశీలమ్మ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో అనంతశక్తి సిఇఒ లావణ్యతో పాటు మహాశక్తి సిఇఒ రమీజా, మహాశక్తి పాలకవర్గం సభ్యులు పాల్గొన్నారు. మహాశక్తి గురించి క్రిష్టమ్మ, లీగల్ ఎయిడ్ కమిటీ గురించి లక్ష్మినరసమ్మ తెలిపారు. అలాగే చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్యవివాహాలు, గృహహింస, నిర్ణయాధికారం పై సిబ్బంది నాటిక రూపంలో వివరించారు. కార్యక్రమంలో సొసైటీ న్యాయ సలహా కేంద్రం సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఐచర్ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న గజేంద్ర(26) తన ద్విచక్ర వాహంపై ఎర్రగుంట వైపు బయల్దేరాడు. మార్గమధ్యలో స్థానిక దేవి నర్సింగ్ హోం ముందు ప్రధాన రహదారిలో వెనుక నుంచి అతి వేగంగా వచ్చిన ఐచర్ వాహనం ఢీకొనడంతో గజేంద్ర అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత...

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కేకాతి గ్రామానికి చెందిన విశ్వనాథ్ భార్య శ్వేత(41) ఆత్మహత్యకు పాల్పడినట్లు మంగళవారం ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. శ్వేతకు తరచూ కడుపునొప్పి వచ్చేదని, వివిధ ఆసుపత్రుల్లో వైద్యం చేయించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గత ఆదివారం సాయంత్రం ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు మడకశిర, హిందూపురం ఆసుపత్రుల్లో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం అనంతపు రం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడ చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందింది. ఈ విషయమై శ్వేత సోదరుడు శ్రీనాథ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రకాష్ తెలిపారు. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన రామాంజనేయులు కుమార్తె రేణుక మంగళవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు.. రేణుకకు పుట్టుకతోనే మూగ, చెవుడు ఉన్నాయి. ఆమె ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొంది. కుటుంబ సభ్యులు గమనించి రేణుకను ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రేణుక ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియాల్సి ఉంది.

కుటుంబ కలహాలతో వివాహిత..

ధర్మవరం పట్టణంలోని కేతిరెడ్డి కాలనీకి చెందిన వెంకటేష్ భార్య గంగాదేవి ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. వివరాలు.. కుటుంబ కలహాలతో మనస్థాపంచెందిన ఆమె ఇంట్లో ఉన్న సూపర్ వ్యాస్మోల్(విషద్రావకం) తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. గంగాదేవి వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆ దంపతులు కూలి మగ్గం పని చేస్తారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రొద్దం : మండలంలోని ఎం.కొత్తపల్లి గ్రామ సమీపంలో మంగళవా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన తలారి అనిల్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు.. అనిల్ ద్విచక్ర వాహనంపై గ్రామ సమీపంలోని పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు పక్కన ఆపిన కారును ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన అనిల్‌ను రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స తర్వాత పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పేకాట జూదరులు అరెస్టు

గోరంట్ల : మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీ పరిధిలోని చుండూరువాండ్లపల్లి గ్రామశివారులో మంగళవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి 9 మందిని అరెస్టు చేసి రూ. 5,600 స్వాధీనం చేసుకు న్నట్లు సిఐ శేఖర్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ ఛైర్మన్ మృతి

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని పైడేటి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు డివి. రమణ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. రమణ డెంగీ జ్వరంతో నాలుగు రోజుల క్రితం హిందూపురంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. జ్వరం తీర్వం కావడంతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. రమణ వైసిపి మండల కన్వీనర్‌గా, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్‌గా పని చేశారు. వైసిపి బలోపేతానికి కృషి చేశారని, ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. రమణకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

మాజీ ఎంపిటిసి మృతికి నివాళులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక వినాయక్‌నగర్‌కు చెందిన మాజీ ఎంపిటిసి నవకోటి నారా యణ బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైసిపి టౌన్ కన్వీనర్ గోవిందమ్మగారి శ్రీనివాసు లు, మాజీ సర్పంచి రమాకాంత్‌రెడ్డి నారాయణ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈయన కుమారుడు శివ భార్య ప్రస్తుతం వైసిపి ఎంపిటిసిగా ఉన్నారు. అలాగే సాయినగర్‌కు చెందిన చాకలి వెంకటేష్ అనారోగ్యంతో మృతి చెందగా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి డిసి అశోక్, పట్టణ ఉపాధ్యక్షులు జి.మంజు, కళ్యాణ్, ఇమామ్‌వలి, సూర్యప్రతాప్‌రెడ్డి, ఎంపిటిసి సాయిరాం, బాబు, రమేష్, పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-మడకశిర

పంటల సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవ చ్చునని వ్యవసాయ అధికారి తిమ్మప్ప తెలిపారు. మండలంలోని ఏఆర్.రొప్పం, ఆమిదాలగొంది గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. వేరుశెనగ, మొక్కజొన్న, పత్తి పంటల సాగులో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులను ఏవో రైతులకు వివరిం చారు. ఎరువులు, యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ మందుల గురించి వివరించారు. కార్యక్రమంలో సెరికల్చర్ ఆఫీసర్ ప్రతాప్‌నాయక్, రైతు సేవా కేంద్రం సిబ్బంది హిమబిందు, మమత, ప్రకతి సేద్యం సిబ్బంది పాల్గొన్నారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

ప్రజాశక్తి-తనకల్లు

బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్ఐ గోపి సూచించారు. మండలంలోని సిజి ప్రాజెక్టు వద్ద ఉన్న గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహిం చారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ పిల్లలు హక్కులతో పాటు బాధ్యతలు కలిగి ఉండాలన్నారు. సమాజంలో బాలికలపై జరిగే లైంగిక వేధింపుల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. అనంతరం పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుస్మిత జ్యోత్స్న, జిల్లా బాలల పరిరక్షణ సమితి రక్షణ అధికారి నాగలక్ష్మి, సిఐఎఫ్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, వనజాక్షి, సామాజిక కార్యకర్త సమత, శ్రీనివాస్‌నాయుడు, బాబ్‌జాన్, ముంతాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు, పాల్గొన్నారు

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజానికానికి తెలియజేయడం ఏమనగా శ్రీ సత్యసాయి జిల్లా డి.నెం:2-297, మారుతీ నగర్ సోమందేపల్లి, శ్రీ సత్యసాయి జిల్లా. ఆంధ్రప్రదేశ్- 515122లో నివసించు JM జనార్దన్ భార్య మామిళ్ళ నాగమణి అనువారు నా క్లయింట్ అయిన మణప్పురం ఫైనాన్స్ లిమిటెడ్ రైల్వే స్టేషన్ రోడ్ గుంతకల్ బ్రాంచ్ వారి దగ్గర మోర్ట్ గేజ్ లోన్ కొరకు సంప్రదించారు.సదరు జుట్టన్నా గారి మాబ్జాన్, తాడిపత్రి, పట్టణములో జిరాక్స్ సెంటర్ దగ్గర డాక్యుమెంట్లు జిరాక్స్ చేయించుకొని తిరిగి వస్తుండగా దారిలో తేది: 22.10.2024 డాక్యుమెంట్ నెంబర్: (7457/2009) పోయినది అని తెలిపారు.ఈ విషయంపై సోమందేపల్లె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు కూడా ఇచ్చి ఉన్నారు. కావున ప్రకటన ద్వారా తెలియచేయడం ఏమనగా ఎవరికైనా పైన తెలిపిన ఒరిజినల్ విక్రయ దస్తావేజు దొరికిన దానిని మా క్లయింట్‌కు ఇవ్వగలరని మనవి. ఎవరికైనా ఏ విధమైన అభ్యంతరాలు ఉన్నచో 7 రోజుల లోపల తెలుపవలెను.

P.VENKATANAIDU,
Advocate, Guntakal. Cell: 7780432231.